క్లుప్తంగా

ఎన్నికల కోడ్ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

చిల్లకూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా ప్రతిఒక్కరూ పాటించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో, బీఎల్‌ఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో విగ్రహాలకు ముసుగులు తొడగాలని, ఫ్లెక్సీలు ఉంటే తొలగించాలన్నారు. ఈవీఎంలపై అవగాహన కోసం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, అందులో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. ఎంపీడీఓ భానుమూర్తి, ఎస్‌ఐ అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

ఓజిలి: ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని అమలు చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఓజిలి సచివాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో సీఎం, ఎమ్మెల్యే ఫొటోలను తొలగించాలన్నారు. విగ్రహాలకు ముసుగులు వేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

కోట: మండలంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం ఎస్‌ఎస్‌సీ ఏఎంఓ శివశంకరయ్య తనిఖీ చేశారు. ఆరు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఇంగ్లిష్ పరీక్ష రాస్తున్న క్రమంలో ఏఎంఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు చోట్ల విద్యార్థులు పక్కపక్కనే కూర్చుని పరీక్ష రాస్తుండడంపై ఇద్దరు ఇన్విజిలేటర్లను మందలించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

గ్రామాల్లో పర్యటించిన అధికారులు



ఉచ్చూరులో పర్యటిస్తున్న అధికారులు

దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ఎంపీడీఓ శివరాజు, ఏఓ రఘురామయ్య, సచివాలయం సిబ్బంది బుధవారం ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పర్యటించారు. ఎక్కడైనా పోస్టర్లు, పార్టీలకు చెందిన గుర్తులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. ఉచ్చూరు, నెలబల్లి, ఏకొల్లు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ఎన్నికల కోడ్‌ను పాటించాలని సచివాలయం సిబ్బందికి అధికారులు తెలియజేశారు.


గ్యాస్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఓజిలి: ఓజిలి గ్రామంలోని ఎస్‌ఎస్‌ఆర్ గిరిజన కాలనీలో ఆర్‌ఆర్‌హెచ్‌పీ గ్యాస్ నిర్వాహకుల ఆధ్వర్యంలో గ్యాస్ వినియోగంపై మహిళలకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యాస్ సిబ్బంది మాట్లాడుతూ గ్యాస్ పైప్, లైటర్లు, రెగ్యులేటర్లను తరచూ మార్చుకోవాలని సూచించారు.


వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరురూరల్: పట్టణంలో వెలసియున్న అళఘనాథస్వామి దేవస్థానం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి అమ్మవార్లకు విశేష అలంకరణ ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాల నడుమ గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని కొడిముద్దలను స్వీకరించారు. ఉభయకర్తలుగా మాగుంట నరేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వాకాడు: మండలంలోని జానరేపేట గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి పనబాక శ్రీనాథ్‌కు బుధవారం హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. శ్రీనాథ్ కుటుంబం పేదరికంతో బాధపడుతున్న క్రమంలో సమాచారం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్ టీం సభ్యులు తన విద్యా అవసరాల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయాన్ని స్థానిక ఉపాధ్యాయుల ద్వారా అందజేశారు. సంస్థ నిర్వాహకులు జోనస్ బెన్నై, ఉపాధ్యాయులు బీ రాజ్‌కుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మురుగు బాధలకు చెక్

- రూ.10.20 కోట్లతో డ్రైనేజీ కాలువల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు





పున్నేపల్లిలో నిర్మించిన కాలువ, కొత్తపేటలో డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఈఈ నాగజ్యోతి

ఓజిలి: వర్షం వస్తే ఇళ్లలోని మురుగునీరంతా గతంలో రోడ్లపై ప్రవహించేది. రోడ్లపై చెత్తాచెదారం నీటితో కలిసి దుర్గంధం వెదజల్లుతున్న రోజులు అవి. ప్రస్తుత ప్రభుత్వం మురుగునీరు రోడ్లపై ప్రవహించకూడదనే ఉద్దేశంతో డ్రైనేజీ కాలువల నిర్మాణాలను చేపట్టింది. ప్రతి గ్రామంలో సిమెంట్‌రోడ్ల పక్కనే డ్రైనేజీ కాలువలు నిర్మించి మురుగునీరు పారేందుకు చర్యలు చేపట్టింది. మండల పరిధిలోని 26 పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో పంచాయతీలకు ప్రస్తుత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ముందుగా గ్రామాల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

రూ.10.20 కోట్ల నిధుల మంజూరు...

మండలంలోని 26 గ్రామపంచాయతీలలో ఉపాధిహామీ పథకం, స్వచ్ఛభారత్ పథకాలలో రూ.10.20 కోట్లతో డ్రైనేజీ కాలువలు నిర్మించారు. గతంలో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం విఫలమైంది. గ్రామాల్లోని రోడ్లపై మురుగునీరు నిల్వ చేరడంతో దోమలు, ఈగలు, పందులు సంచరించడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ప్రభుత్వానికి గ్రామస్తులు, నాయకులు డ్రైనేజీ సమస్యను విన్నవించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక చొరవ తీసుకుంది. మండలంలోని కురుగొండ రూ. కోటి, ఆర్మేనిపాడు రూ.54లక్షలు, మానమాల రూ.80లక్షలు, పున్నేపల్లి రూ.84 లక్షలు, బట్లకనుపూరుకు రూ.45 లక్షలు, రాచపాళెం రూ.40లక్షలు. కొండవల్లిపాడు రూ.62లక్షలు, వెంకటరెడ్డిపాళెంకు రూ.1.20 కోట్లు, ఇనుగుంట రూ.84, కర్రబల్లవోలు రూ.60 లక్షలు, అత్తివరం రూ.72 లక్షలు మంజూరు చేసింది. ఇందులో 10 శాతం స్వచ్ఛభారత్ మిషన్ నిధులు కాగా, మిగతా 90 శాతం ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు పర్యవేక్షణలో పనులు చేయించారు. కాలువలపై దుర్వాసన రాకుండా మూతబండలను వేయించారు. నాణ్యత విషయంలో రాజీ లేకుండా మురుగు కాలువ పనులను పూర్తి చేశారు. బట్లకనుపూరు, మానమాల గ్రామాల్లో డ్రైనేజీ కాలువల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కొన్ని పంచాయతీలలో కాలువ నిర్మాణాలను చేపడుతున్నారు. మురుగు నీటి కాలువల సమస్య తీరడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రస్తుత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.



మానమాలలో నిర్మాణంలో ఉన్న కాలువ

దుర్వాసన సమస్య తీరింది



గ్రామంలో మురుగు కాలువలు లేకపోవడంతో మా ఇంటి వద్ద రోడ్లపైనే మురుగు నీరు నిల్వ ఉండేది. రోడ్లపై నడవడానికి వీల్లేకుండా ఉండేది. గతంలో అధికారులు పర్యటించిన సమయంలో విన్నవించినా ఫలితం లేదు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా కాలనీలో డ్రైనేజీ కాలువలు పూర్తిగా నిర్మించారు. మాకు చాలా సంతోషంగా ఉంది. – తుపాకుల పోలయ్య, మానమాల

గతంలో పట్టించుకున్న వారే లేరు



వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై ప్రవహించేది. కాలువలు నిర్మాణం చేపట్టాలని గతంలో అధికారులకు వినతిపత్రాలు అందించాం. పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సమస్యను విన్నవించాం. మా గ్రామంలో రూ.54లక్షలతో మురుగు కాలువలు నిర్మించారు. సమస్య పరిష్కారమైంది. ప్రస్తుత ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – అజ్మతుల్లా ఆర్మేనిపాడు

పూర్తిస్థాయిలో నిర్మాణం



డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం ఓజిలి మండలంలో రూ. 10.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రతి గ్రామంలో మురుగు నీరు పారేందుకు కాలువలు నిర్మాణం చేపట్టాం. నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు చేయించాం. క్వాలిటీ కంట్రోల్ అధికారులు పనులను పర్యవేక్షించారు. – ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ ఓజిలి

విజయానికి సహకరించండి



ఇంద్రసేనమ్మ నివాసంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో పూర్తి సహకారం అందించి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని ముత్యాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మను గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ కోరారు. పట్టణంలోని ఆమె నివాసంలో బుధవారం రాత్రి కలిసి ఏప్రిల్ 1 నుంచి 5 వరకు జరిగే ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మేరిగ మురళీధర్‌ను కండువాతో సత్కరించారు. అనంతరం మేరిగ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీచేస్తున్నానని, తిరుపతి ఎంపీ అభ్యర్థిగా గురుమూర్తి పోటీచేస్తున్నందున ఇద్దరి గెలుపునకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో గూడూరు మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, నేతలు బాబురెడ్డి, సుధీర్‌రెడ్డి, జగదీష్‌నాయుడు పాల్గొన్నారు.

తాత్కాలిక అంగళ్ల నిర్వహణపై సందిగ్ధం



తాత్కాలిక అంగళ్లపై చర్చిస్తున్న అధికారులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఏప్రిల్ 2 నుంచి 5 వరకు జరగనున్న జాతర సందర్భంగా ఏర్పాటు చేసే తాత్కాలిక అంగళ్లపై సందిగ్ధత నెలకొంది. ముత్యాలమ్మ ఆలయానికి ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు వేలంపాట నిర్వహించారు. అయితే ఆ స్థలానికి సంబంధించి ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఎనిమిది వారాల పాటు ఆ స్థలాన్ని యథాతథంగా ఉంచాలని ఆదేశాలిచ్చింది. దీంతో వేలంపాటలో దక్కించుకున్న వారు తమకు అంగళ్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కల్పించాలని అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం కనుపూరు ముత్యాలమ్మ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీ స్థలంపై కోర్టు ఆదేశాలు ఉన్నందున రెండు రోజుల్లో ఆర్డీఓతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అంజిరెడ్డి, ఈఓపీఆర్డీ మాణిక్యం పాల్గొన్నారు.

ఇలాంటివి పట్టించుకోరా?



పసుపుదళంలో మినరల్ వాటర్‌ప్లాంట్

వెంకటగిరి(సైదాపురం): ఎన్నికల నిబంధనలో అధికారులకు పసుపు రంగులో ఉన్న భవనాలు, వాటర్‌ప్లాంట్‌లు కనిపించడంలేదు. పట్టణంలో గత టీడీపీ హయాంలో పాలకేంద్ర సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ టీడీపీ రంగుతోనే ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం కోడ్ ఉల్లంఘన కాదా? అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ముస్లింలకు చేయూత అభినందనీయం



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరురూరల్: రంజాన్ మాసంలో పేద ముస్లింలకు చేయూత అందించడం అభినందనీయమని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో బుధవారం మొహమ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 786 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఇందులో పాల్గొన్న మేరిగ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మగ్దూం మోహిద్దీన్ తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసంలో పేదలకు చేయూత ఇవ్వడం గొప్ప విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మగ్దూం మోహిద్దీన్, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సర్తాజ్, అన్వర్‌బాషా, మైనార్టీ నేతలు అజీజ్‌ఖాన్, జలీల్, కాలేషా, అల్తాఫ్, బాబు, షబ్బీర్, యస్థాని పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

గూడూరురూరల్: గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ తాగునీటికి రెండు రోజుల పాటు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండలేరు జలాశయం నుంచి గూడూరుకు సరఫరా అవుతున్న వాటర్ పైప్ లైన్ మలిచేడు వద్ద నాలుగు భారీ లీకేజీలు ఏర్పడ్డాయని ఈ మేరకు పైప్‌లైన్‌ల మరమ్మతు నిమిత్తం రెండు రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి అందించేందుకు ప్రైవేటు ట్యాంకర్లు, మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని, మీ పరిధిలో ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్లు, వార్డు ఎమినిటీ కార్యదర్శులు కావలి దయానంద్-7032835010, గోపాలకృష్ణ భరత్-8919234680, ఈగ శివశంకర్-8790629273, నన్నం ప్రసాద్ 77994 55200 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చెన్నూరు, విందూరులో పోలీసుల కవాతు



చెన్నూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, సీఐ

గూడూరురూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర బలగాలతో కలిసి బుధవారం మండలంలోని చెన్నూరు, విందూరు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని సీఐ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, అసాంఘిక చర్యలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

కండలేరులో 8.594 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 8.594 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారి సేవలో కలెక్టర్ లక్ష్మీశ

చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దర్శించుకున్నారు. ఆలయ వద్దకు చేరుకున్న ఆయనకు సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నివాళి

నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ



వాకాడు: వాకాడు గొల్లపాళెం గ్రామానికి చెందిన పాపారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి ఉత్తర క్రియలకు బుధవారం వైఎస్సార్‌సీపీ వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళీధర్ హాజరయ్యారు. సుబ్రమణ్యంరెడ్డి చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు పాపారెడ్డి మనోజ్ కుమార్‌రెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో నేతలు కె.దామోదర్‌రెడ్డి, ఎస్.హిమకుమార్‌రెడ్డి, డి నాగూర్‌రెడ్డి, పి.రాజశేఖర్‌రెడ్డి, జి.సుధాకర్ రెడ్డి, సంపత్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



కేసీ గోపవరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కలువాయి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కలువాయి మండలంలో బుధవారం ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రచారం ప్రారంభించారు. కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు తొలుత గ్రామ దేవత కలువాయమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి కేసీ గోపవరం గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు పంగా పెంచలనరసారెడ్డి, సర్పంచ్ జి.ఓబులమ్మ, ఉపసర్పంచ్ బి.వెంకటరత్నారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కలువాయి: కుల్లూరులోని శ్రీదేవీ భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమానికి మాజీ శాసన మండలి సభ్యులు మాదాసు గంగాధరం, నళినమ్మ, మాదాసు యజ్ఞపవన్, అపర్ణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవదేవేరులకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ఉదయం స్వామి వారికి అగ్ని ప్రతిష్టాపన, శాంతి హోమం, పంచామృతాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఇరు దేవేరులకు కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

కండలేరును సందర్శించిన ట్రైనీ కలెక్టర్



జలాశయాన్ని సందర్శిస్తున్న సంజన సింహ

రాపూరు: మండలంలోని కండలేరు జలాశయాన్ని ట్రైనీ కలెక్టర్ సంజన సింహ బుధవారం సందర్శించారు. జలాశయం నిర్మాణం, నీటి సామర్థ్యం వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు. ట్రైనీ కలెక్టర్‌కు ఎస్‌ఈ రామిరెడ్డి కండలేరు జలాశయం గురించి వివరించారు. డీఈలు విజయరామిరెడ్డి, నాగేశ్వరావు, ఏఈ తిరుమలయ్య ఉన్నారు.

ఘనంగా పిచ్చుకల దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న డీఎఫ్‌ఓ శామ్యూల్

సూళ్లూరుపేట: ఒకప్పుడు గ్రామాల్లో పిచ్చుకలు విరివిగా వుండేవని, ఈ రోజున ఆ పిచ్చుకలు అంతరించి పోవడానికి మనుషులే కారణమని సూళ్లూరుపేట వన్యప్రాణి సంరక్షణ విభాగం డీఎఫ్‌ఓ పి.శామ్యూల్ అన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎకో క్లబ్, జంతుశాస్త్రం, పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అటకానితిప్పలోని పర్యావరణ విజ్ఞానకేంద్రంలో బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అటకానితిప్ప వద్ద అంతరించిపోతున్న పక్షుల జాతులను కాపాడుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన వన్యప్రాణి సంరక్షణ విభాగం డీఎఫ్‌ఓ శామ్యూల్ ప్రసంగిస్తూ అనంత విశ్వంలో ప్రతి జీవి విలువైనదేనని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని తెలిపారు. ప్రకృతిలో మనిషి జీవనానికి ప్రమాదకరమైన క్రూర జంతువులు, విషసర్పాలు వలన కూడా మానవులకు మేలు జరుగుతుందనే విషయాన్ని మరిచిపోయి వాటిని చంపుతుంటామని ఆయన అన్నారు. పిచ్చుకల విషయానికొస్తే ఒకప్పుడు పిచ్చుకలకు ఆహారాన్ని అందించేందుకు వరి వెన్నులను ఇంట్లో కట్టేవారు. నేడు మనిషి ఆధునిక జీవన విధానానికి అలవాటు పడిపోయి మన చుట్టూ వున్న కొన్ని పక్షులు కనుమరుగైపోతున్నాయని ఆయన అన్నారు. ఉన్న వాటినైనా మనమంతా రక్షించుకోవాలని ఆయన విద్యార్థులకు ఈసందర్భంగా సూచించారు.

డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ పిచ్చుకల సంఖ్య తగ్గిపోవడానికి కారణం పంటలకు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువుల వాడకం పెరిగినందువల్లేనని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ బి.రాజేంద్రప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఓ. ప్రకాష్‌రావు, డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ పి.ఏడుకొండలు పాల్గొన్నారు.